# కొలువుదీరవయ్యా... బొజ్జ గణపయ్య


కొర్రపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం


పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో గణనాథున్ని కొలువుదీర్చేందుకు ఉత్సవ కమిటీల వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీల వారు మండపాలను సిద్ధం చేసుకుని విగ్రహాలను తమతమ మండపాలవద్దకు తరలించారు. పట్టణంలోని వైఎంఆర్ కాలనీ, కొర్రపాడు రోడ్డు, రామేశ్వరం, వినాయకనగర్, వసంతపేట, మిట్టమడి వీధి, శివాలయం ఉత్సవ కమిటీలతో పాటు పట్టణంలోని అన్ని గణపతి మహోత్సవ కమిటీల వారు చవితికి ఏర్పాటు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీల వారు రకరకాల రంగుల పందిళ్లతో స్టేజీలను సిద్ధం చేశారు. బుధవారం నుంచి గణనాథుని విగ్రహాలకు 3, 5, 7, 9 రోజుల పాటు పూజలు చేసి నిమజ్జనం చేయనున్నారు.

**జోరుగా పండుగ వ్యాపారం**

**ప్రొద్దుటూరు కల్చరల్ :** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం వీధి, పాతమార్కెట్, కొర్రపాడు రోడ్డు పలువీధుల కూడళ్లలో మంగళవారం సాయంత్రం కొనుగోలు దారులతో కిటకిటలాడింది. వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, గరిక, అరిటాకులు, మామిడాకులు, పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్, కోనేటి కాలువ వీధి, శివాలయం వీధి కిక్కిరిశాయి. పండుగ సందర్భంగా వ్యాపారులు మామూలు కంటే అధిక ధరలకు విక్రయించారు. వెలక్కాయ రూ.25, చెరకుగడ ఒకటి రూ.50, మొక్కజొన్న కంకి రూ.15, గరిక రూ.20 అరటి ఆకులు రెండు రూ.20, అరటి బోదె ఒకటి రూ.20 పైగా విక్రయించారు. జాజిపూలు, కనకాంబరం, మల్లెపూలు, రోజాపూలు, చెండుమల్లె, చామంతి తదితర పూలు సాధారణం కంటే అధిక ధరలు పలికాయి. కొనుగోలుకు వచ్చిన వారితో శివాలయం వీధి కిక్కిరిసింది. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా బందోబస్తు నిర్వహించారు.

**విగ్రహాలు పంపిణీ**

**ప్రొద్దుటూరు కల్చరల్ :** మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని వ్యాపార వేత్త సీవీ సురేంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక శివాలయం వీధిలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 300 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

**మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి**

**ప్రొద్దుటూరు :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని డీఎస్పీ భావన, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని అరబిందో ఇంటిగ్రల్ పాఠశాల ఆవరణలో గణపతి సేవా సంఘం సౌజన్యంతో 1000 మట్టి వినాయక విగ్రహాలను డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ ప్రజలకు పంపిణీ చేశారు. ప్రముఖ డాక్టర్లు నాగదస్తగిరిరెడ్డి, వైవీ స్వరూప్ కుమార్‌రెడ్డి, టీడీ వరుణ్‌కుమార్ రెడ్డి , గణపతి సేవా సంఘం ప్రతినిధులు కౌన్సిలర్ వి.మురళీధర్‌రెడ్డి, రొటేరియన్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ జ్యువెలర్స్ అధినేత పాలగిరి రామకృష్ణారెడ్డి, వ్యాపారి ఎం.రజనీకాంత్‌రెడ్డి, అరబిందో ఇంటిగ్రల్ పాఠశాల కరస్పాండెంట్ కాశీప్రసాద్‌రెడ్డి, యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఊరూరా..చవితి సందడి**

**బద్వేలు అర్బన్ :** విఘ్నాలను తొలగించి మము కాపాడ రావయ్యా అంటూ భక్తులు ఆదిదేవున్ని పూజించడానికి సిద్ధమవుతున్నారు. బుధవారం వినాయకచవితి పండుగ సందర్భంగా పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పట్టణంలోని ఆయా వీధుల్లో గణపతి విగ్రహాలను కొలువుదీర్చడానికి కమిటీ నిర్వాహకులు, ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటికే వివిధ రకాల డిజైన్లతో భారీ మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చవితి పూజా సామగ్రి కొనుగోలు చేసే భక్తులతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలితో పాటు నెల్లూరు రోడ్డు, మైదుకూరు రోడ్డు, సిద్దవటం రోడ్డులలో పండుగ వాతావరణం కనిపించింది. వినాయకుని ప్రతిమలతో పాటు వినాయకుడికి ఇష్టమైన చెరుకుగడలు, వెలక్కాయలు, గడ్డి, పూలు, పండ్లు తదితర పూజా సామాగ్రిని


మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ భావన, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే ఆయా వీధుల్లో ఏర్పాటు చేసే వినాయక ప్రతిమలను యువకులు ఉత్సాహంగా ట్రాక్టర్లపై ఊరేగింపుగా తరలించారు. పట్టణ పరిధిలో సుమారు 150కు పైగా విగ్రహాలు నెలకొల్పనున్నారు.

**మండపాలకు చేరుకున్న గణనాథులు**

**గోపవరం :** మండలంలో గ్రామగ్రామాన ఏర్పాటు చేసిన మండపాలకు గణనాథులు చేరుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుండే బద్వేలు నుండి ఆయా గ్రామాలకు గణనాథులను తరలించారు. మంగళవారం సాయంత్రానికే మండపాలను సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు రంగులు చల్లుకుంటూ బాణాసంచా పేల్చుతూ వాయిద్యాల మధ్య గణనాథులను తీసుకురావడం జరిగింది. బుధవారం ఉదయం నుండే అన్ని గ్రామాల్లో గణనాథులు మొదటి పూజను అందుకోనున్నాయి. గణనాథుల ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి కావడంతో ఉత్సవ కమిటీ సభ్యులు అనుమతులు తీసుకుని అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మూడు, ఐదు రోజులు గణనాథులు పూజలు అందుకోనున్నారు. మంగళవారం సాయంత్రం నుండే గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు చోటుచేసుకున్నాయి.

**మట్టి వినాయకుని పూజిద్దాం**

**మైదుకూరు :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని పూజించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాలలో మట్టి వినాయకుని పూజిద్దాం అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బాలగంగాధర్ తిలక్ అనేక మంది జాతీయ నాయకులు గణేష్ మహోత్సవ ఉద్యమాన్ని ప్రజల్లో చైతన్యం నింపడానికి ప్రారంభించారని గుర్తు చేశారు. ఆంగ్ల అధ్యాపకుడు రాధారామ్ మాట్లాడుతూ వినాయక చవితి వైశిష్టతను సాంప్రదాయ పద్ధతులను వివరించారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పూజలో వినియోగించే 21 రకాల పత్రాల ఔషధ విలువలు, వాటి ప్రత్యేకతలను వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అధ్యాపక బృందం విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.


గణేశ ప్రతిమలను కొనుగోలు చేస్తున్న భక్తులు

## క్లుప్తంగా

### వినాయక చవితి శుభాకాంక్షలు


ఆదిత్యారెడ్డి

**పోరుమామిళ్ల :** నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ వినాయకచవితి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని, విగ్రహ ప్రతిష్టలో ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా చూసుకోవాలని, విగ్రహాల నిమజ్జనం సాఫీగా జరిగేందుకు, అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

**బి.కోడూరు :** మండలంలోని ఐత్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా స్కూల్ చిల్డ్రన్ ఐ స్క్రీరింగ్ (ఎస్‌సీఈఎస్) కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య మాట్లాడుతూ దృష్టి లోపం రాకుండా ఉండాలంటే సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని, టీవీకి దూరంగా ఉండాలని, వెలుతురు బాగా ఉన్న ప్రదేశంలో చదువుకోవాలని, కళ్ళకు తగినంత విశ్రాంతి ఇవ్వాలని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, క్యారెట్, చేపలు, గుడ్లు వంటివి తీసుకోవాలన్నారు. సుమారు 75 మంది విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 6 మంది విద్యార్థులను గుర్తించి కంటి అద్దాల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీలు గౌతమి, ప్రియదర్శిని, ఏఎన్‌ఎం మాధవి, ప్రిన్సిపల్ శ్రీలత, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు నరసింహులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రైతులు సూచనలు పాటించాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ దేవి పద్మలత

**చాపాడు :** పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులు వ్యవసాయంపై సలహాలు, సూచనలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లె, వెంగన్నగారిపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వరి సాగు ముమ్మరంగా చేస్తున్నారని ఈ క్రమంలో రైతులందరూ తమ గ్రామాల పరిధిలో వ్యవసాయ కేంద్రంలో సంప్రదించి సాగులపై అవగాహన కల్పించుకోవాలన్నారు. వరి సాగులో పాటించాల్సి నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

**పోరుమామిళ్ల :** పట్టణంలోని బెస్తవీధికి చెందిన పార్టీ అభిమాని అఫీజాబేగం అనారోగ్యంతో మృతి చెందిన సమాచారంతో మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారింటికి వెళ్లారు. పార్థివదేహం సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఐలను సత్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు


బద్వేలు రూరల్ సీఐను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**బద్వేలు అర్బన్ :** ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బద్వేలు అర్బన్ సీఐ ఎస్.లింగప్ప, బద్వేలు రూరల్ సీఐ ఎన్.క్రిష్ణయ్యలను మంగళవారం ఆయా స్టేషన్లలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, బూత్‌కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోటనాగేశ్వర్‌రావు, మున్సిపాలిటీ నాయకులు లక్ష్మిరెడ్డి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

### 9 మందిపై బండోవర్ కేసులు

**ప్రొద్దుటూరు రూరల్ :** ప్రొద్దుటూరు టూటౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 9 మందిపై బండోవర్ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ గంగయ్య మంగళవారం పేర్కొన్నారు. వినాయక చవితి మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ దాని ఉల్లంఘనపై ఈ కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు.

## ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోండి

**బద్వేలు అర్బన్ :** సబ్‌జైలులోని అవసరమైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును మంగళవారం సందర్శించిన ఆయన జైలు పరిసరాలను, వసతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు.

**కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలి**

గిరిజన, సంచార జాతుల పిల్లలు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని జంగాలకాలనీలో గిరిజన ప్రజలలో బాల్యవివాహాలు - చిన్న వయస్సులోనే గర్భధారణ, గిరిజన హక్కుల రక్షణ, అమలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు శ్రీనివాసులు, చక్రధర్, పారాలీగల్ వాలంటీర్లు, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

## యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యంవెంకటసుబ్బారెడ్డి

**బద్వేలు అర్బన్ :** ఆరుగాలం శ్రమించే రైతన్నకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యంవెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బద్వేలులో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు సకాలంలో ఎరువులను అందించలేకపోవడం దారుణమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలో, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు నియోజకవర్గంలో సైతం రైతులకు ఎరువులు లభించక వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. యూరియా నిల్వలపై వ్యవసాయశాఖ చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధమే లేదన్నారు. మరోవైపు రైతుల దృష్టిని మరల్చేందుకు విజిలెన్స్ కమిటీల పేరుతో ఎరువుల దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తూ ఆర్భాటం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం కక్షపూరిత చర్యలతో కాలం వెల్లదీస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే రైతులకు అవసరమైన మేరకు యూరియాను సమకూర్చాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## వలసల నివారణకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటే ఏకైక మార్గం

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

**బద్వేలు అర్బన్ :** వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో వలసల నివారణకు కడపలో ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమ ఏర్పాటే ఏకైక మార్గమని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పేర్కొన్నారు.

మంగళవారం పట్టణంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో కరువు కారణంగా ఉపాధి అవకాశాలు లేక ఎంతో మంది యువత గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలు, ఆత్మహత్యల నివారణకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఎంతో అవసరం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని అన్నారు. జిల్లాలోని పరిశ్రమలు ఇక్కడ భూమిని, వనరులను వాడుకుని అధిక లాభాలు పొందుతున్నారే తప్ప స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి పరిశ్రమలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కడప ఉక్కు సాధన కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియంచిన్ని, వీరనారశివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, జిల్లా కమిటీ సభ్యులు విజయ్, విశ్వనాథ్, సురేంద్ర, షరీఫ్, ఫాతిమా, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలి

**అట్లూరు :** పంట సాగు సాగు చేసిన ప్రతి రైతూ ఆ పంటకు సంబంధించి పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని తంబళ్లగొంది రెవెన్యూ పొలంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. అనంతరం సాగులో ఉన్న వరిపైరును పరిశీలించారు. వరిలో ఆకుముడత తెగులును గుర్తించి పురుగు నివారణ మందులను తెలియజేశారు. అలాగే రైతులకు 50 శాతం సబ్సిడీతో జిప్సం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు ఆంక్షలు పెట్టకూడదు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** వినాయక చవితి ఉత్సవాలకు ఆంక్షలు పెట్టకూడదని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగళ శశిభూషణ్ రెడ్డి తెలిపారు. స్థానిక గీతాశ్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ హిందువులంతా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని తెలిపారు. హిందూ సాంప్రదాయ బద్ధంగా, ఆచారాల ప్రకారం ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్రరావు, గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, మారెళ్ల మల్లికార్జునరావు, మార్కండేయ తదితులు పాల్గొన్నారు.

## మదర్‌థెరిసా సేవలు ఆదర్శనీయం


మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

**బద్వేలు అర్బన్ :** సేవే పరమావధిగా తన జీవితాన్ని పేదలకు సేవ చేయడానికి అంకితం చేసిన మదర్‌థెరిసా జీవితం ఆదర్శనీయమని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కె.బ్రహ్మయ్య పేర్కొన్నారు. మదర్‌థెరిసా 115వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాయలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో ఎంతో మంది రోగులకు వైద్యసేవలు అందించారన్నారు. ఆమె మనమధ్య నేడు భౌతికంగా లేనప్పటికీ ఆమె చూపిన సేవామార్గం ఎంతో మందికి స్ఫూర్తినిస్తోందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ సలహాదారుడు పుల్లంరాజు, అసోసియేట్ అధ్యక్షుడు జి.పుల్లయ్య, కోశాధికారి గంగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆనందరావు, శ్రీరాములు, శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రామసముద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**బి.కోడూరు :** మండలంలోని రామసముద్రం, ఆనంవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయాధికారి కౌశిక వరిపంటను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ఖరీఫ్ 2025లో పంట సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరిలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి వివరించారు. అలాగే వివిధ పథకాలు, సబ్సిడీ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ షణ్ముఖ్‌శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## అభినందనీయం

**రాజుపాళెం :** పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని హెచ్‌ఎం పేర్కొన్నారు. మండలంలోని వెలవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అయూబ్ ఖాన్, అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ అధ్యక్షుడు ముక్తియార్‌లు క్రీడా విద్యార్థులకు సంబంధించిన వస్తువులను హెచ్‌ఎం ఉమాదేవి, పీడీ చంద్ర ఓబుళరెడ్డిలకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్టేజీ అభివృద్ధి కోసం రూ.10 వేలు నగదును ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ


అంతర్జాతీయ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక సుందరాచార్యుల వీధిలోని హెచ్‌బీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు అంతర్జాతీయ జీత్‌కునెడో కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి 26 బంగారు పతకాలను సాధించారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి క్రీడా ప్రాంగణంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ జీత్‌కునెడో కరాటే పోటీల్లో కట, కుమిట, టీం కట, వెపన్ కట విభాగాల్లో అండర్ -14, 17, 19 విభాగాల్లో అబ్దుల్ జావీద్, సంతోష్‌రెడ్డి, జావీద్, శ్రీతన్మయి, జునైద్, జహీర్, తాసీన్, మహ్మద్ షరీఫ్, మహ్మద్, సుభాన్, గైబూసా, తౌఫిక్, సుదీక్షభాబన, అలీషా భాబన, లైబా, ఇలాహిన్, రోష్నలు బంగారు పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు మాస్టర్ సోహెల్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.